క్లుప్తంగా

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గ్రామ బీసీ, ఎస్సీ కాలనీలకు చెందిన నాగార్జున, కిషోర్ -11 జట్లు తలపడగా విన్నర్‌గా నాగార్జున, రన్నర్‌గా కిషోర్-11 జట్లు నిలిచాయి. విన్నర్ జట్టుకు కాకర్ల సురేష్ రూ.20,116, రన్నర్ జట్టుకు బీజేపీ నేత ముడమాల రమేష్‌రెడ్డి రూ.15,116 నగదు, ట్రోఫీలు అందజేశారు. గండిపాళెం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులకు రమేష్‌రెడ్డి రూ.5 వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ రియాజ్, స్థానికుడు రాపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్



క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

సోమశిల: రోడ్డు పక్కన ఆగి ఉన్న కేజీవీల్స్ ట్రాక్టర్‌ను ఆమనిచిరివెళ్లకు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొని గాయపడ్డాడు. ఈ ఘటన అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి గ్రామానికి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

ఎన్నికలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ వేణు

సోమశిల: అనంతసాగరం మండలం వరికుంటపాడులో ఆదివారం సాయంత్రం ఆత్మకూరు సీఐ వేణు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించడం, వాహనాల్లో మద్యం తరలించడం చేస్తే వాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించకుండా నియంత్రించేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రాపూరు వెంకట సుబ్బారెడ్డి, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, ఏఎస్సై మస్తాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

11న కళానీరాజనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఫిబ్రవరి 11న ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బయ్యా వెంకటరమణయ్య స్మృత్యార్థం కళానీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమ నిర్వాహకుడు కేతాసుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరం ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ సంగీత, జానపద గేయాలు, శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్య పోటీలను ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రోత్సాహకంగా నగదు, సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఫిబ్రవరి 5లోగా 77299 42543 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సుందరరామిరెడ్డి, రఘురామిరెడ్డి, మహేష్, మధుసూదన్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ-2024ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసరెడ్డి, రంగనాథబాబు, శేషారెడ్డి, పాపయ్య , అనిత పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు మేనిఫెస్టో

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- రూ.9 కోట్లతో వింజమూరు-ఆత్మకూరు రోడ్డు పనులకు భూమి పూజ



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను, ముఖ్యంగా మహిళలను కొంత మేర ఆర్థికంగా స్థిరపడేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ప్రకటించే మేనిఫెస్టోలో గ్రామీణ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు తొలి ఏడాదే నిర్మించేలా ప్రకటించమని కోరానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో తన వ్యక్తిగత మేనిఫెస్టో అయితే వీటికే మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. రూ.9 కోట్లతో ఆత్మకూరు-వింజమూరు రహదారి నిర్మాణానికి ఉదయగిరి సమన్వయకర్త కన్వీనర్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన నెల్లూరుపాళెం సబ్‌స్టేషన్ సమీపంలో భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డు పనులు అనుభవం ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు, మార్చి నెలాఖరులోపు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా ఆదేశించినట్లు తెలిపారు. రెండు, మూడేళ్లుగా ఈ రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు వింజమూరు, ఆత్మకూరు నాయకులు తన దృష్టికి తేవడంతో ముఖ్యమంత్రికి తెలిపి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఆత్మకూరు-ఉదయగిరి నియోజకవర్గాల మీదుగా రెండు జాతీయ రహదారులు ఇప్పటికే ఏర్పాటు అయ్యాయని, రెండు పోర్టులు ఏర్పాటు అయ్యాయని ఈ నేపథ్యంలో కృష్ణపట్నం పోర్టు నుంచి బద్వేల్ మీదుగా మరో జాతీయ రహదారి నిర్మాణం కానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ జాతీయ రహదారులను అనుసంధానించేలా త్వరలో సమీప గ్రామాల నుంచి రోడ్లు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రెండు పోర్టులు, మూడు జాతీయ రహదారుల ఏర్పాటుతో నూతన పరిశ్రమలు రానున్నాయని, ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల్లో సుమారు 400 ఎకరాలు, మర్రిపాడు మండలంలో 5,000 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని, వీటిలో ప్రత్యేక సెజ్ ఏర్పాటు చేసి మరిన్ని పరిశ్రమలు ఏర్పాటయ్యేలా సీఎంకు నివేదిక ఇస్తామన్నారు. దీంతో వెనుకబడిన ఈ రెండు నియోజకవర్గాలు రానున్న ఐదేళ్లలో అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే వివరించారు.

ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికి తిరుగుతున్న క్రమంలో వింజమూరు-ఆత్మకూరు రోడ్డు గురించి పలువురు అడిగారని, రోడ్డు పనులు ప్రారంభంతో సమస్య తీరనుందన్నారు. త్వరలో సంగం, కలిగిరి, నందవరం రోడ్డు పనులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువనేత మేకపాటి అభినయ్‌రెడ్డి, ఎంపీపీలు కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయిళ్ల పద్మజ, చేజర్ల, వింజమూరు, ఏఎస్‌పేట, దుత్తలూరు జెడ్పీటీసీలు పీర్ల పార్థసారథి, గణపం బాలకృష్ణారెడ్డి, పి రాజేశ్వరమ్మ, లక్ష్మీకాంతమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పందిళ్లపల్లి సుబ్బారెడ్డి (వీజీఆర్), ఉదయగిరి నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, ఎంపీపీ వినయ్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ రాజు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కలాం, గడ్డం శ్రీనివాసులు, మణి, పలు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, కొప్పోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దుండిగంలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సముదాయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చిత్రంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు

మహనీయుల ఆలోచనలే..

జగనన్న ఆచరణీయ పాలన

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

కావలి: పేదల్లో ఆత్మాభిమానం పెంపొందించి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో నిజాయితీతో పని చేయాలనే మహనీయుల ఆలోచనలే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలుగా పెట్టుకొని ఆచరణీయ పరిపాలన చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తి మండలం దుండిగంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం , వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రంను ఎమ్మెల్యే ఆదివారం ప్రారరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, అంబేడ్కర్, పూలే, సాహూ మహరాజ్, పెరియార్ వంటి మహనీయుల ఆశయాలను సాకారం చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని సాధించారన్నారు. చంద్రబాబు కులాలను అడ్డు పెట్టుకుని రాజకీయంగా ఎదిగారని, జగన్ మాత్రం అంబేడ్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకొచ్చి పేద పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివించి, వారికి విదేశాల్లో చదివే అవకాశాలు కల్పించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేశారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని చంద్రబాబు ముళ్ల పొదల్లో పడేస్తే వైఎస్ జగన్ విజయవాడ నడిబొడ్డులో నిలబెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీలు తల ఎత్తుకునేలా చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై అక్రమంగా కేసులు పెట్టి దొంగలుగా, దోషులుగా చిత్రీకరించి చిత్రహింసలకు గురి చేసింది చంద్రబాబేనని చెప్పారు. అదే వర్గాలకు సీఎం జగన్ అనేక పదవులిచ్చి దొరలను చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం, బడుగుల సాధికారత, పేదలకు పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ నాడూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా ముందంజలో ఉండాలన్నదే సీఎం జగన్ తపన అని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తే శ్రీలంక అవుతుందని విమర్శించిన చంద్రబాబు, ఈ రోజు బాబు షూరిటీ.. భవిషత్ గ్యారంటీ అంటున్నారని చెప్పారు. గతంలో ఎన్టీఆర్‌ను గద్దె దింపగానే మద్యపాన నిషేధం ఎత్తివేసిన చంద్రబాబు, రెండు రూపాయల కిలో బియ్యం కూడా తీసేశారని గుర్తు చేశారు. 2014లో ఇచ్చిన హామీలు చంద్రబాబు నెరవేర్చారా? అని అన్నారు. ఇంటికి ఒక ఉద్యోగం అని చెప్పి అధికారంలోకి రాగానే రెండు లక్షల కాంట్రాక్ట్ ఉద్యోగాలను తొలగించారన్నారు. ఇన్నిసార్లు మోసం చేసిన చంద్రబాబు మాటలు ఎవరూ నమ్మరని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు కూడా చూడకుండా పథకాలు అందిస్తున్నారని చెప్పారు. జన్మభూమి కమిటీలు పెట్టి టీడీపీకి కావాల్సిన వారికి మాత్రమే పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. పేదరికాన్ని కొలబద్ధగా తీసుకుని ప్రజలకు అండగా నిలిచింది సీఎం జగన్ మాత్రమే అని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజే పథకాల అమలుపై సీఎం దృష్టి సారించారన్నారు. చంద్రబాబు మోసకారి మాటలు నమ్మొద్దని, అధికారంలోకి రాలేమని దూషణలు మొదలు పెట్టాడని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి ఏం చేశాడో చెప్పుకోలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నాడని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ బాలయ్య నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సౌరభాలను గుర్తించాలి



తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రపంచంలో మరే భాషకు తీసిపోని విధంగా తెలుగు సాహిత్యం ప్రఖ్యాతిగాంచిందని ఇతిహాసాలు, పురాణాలు, శతకాలు, ప్రణయతత్వం, భక్తి, తదితర అంశాలను సాహిత్యంలో పొందుపరచడంతో ఆ సౌరభాలు దేశ వ్యాప్తంగా వెదజల్లాయని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరుకు చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మేధా పాఠశాల ఆవరణలో 'మంచి మాట' కార్యక్రమం నిర్వహించారు. అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, ఎస్‌వీ చలమయ్య తెలుగు సాహిత్యం గొప్పదనం గురించి వివరించారు. కవన విహార కేంద్రం-ఖండ కావ్యం అనే అంశంపై పెద వెంకటరెడ్డి వివరించారు. తెలుగు సాహిత్యాన్ని రాజుల కాలం నుంచి ఎందరో రాజులు, సామంత రాజులు, జమీందార్లు పెంచి పోషించారని, వారి వల్లనే ఇప్పటికీ ఎన్నో సాహితీ రచనలు, కావ్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రఖ్యాత తెలుగు కవులు రాయప్రోలు, విశ్వనాథ సత్యనారాయణ, జంధ్యాల పాపయ్య శాస్త్రి, గుర్రం జాషువ, తదితరుల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సోమవరపు సుబ్బరాయుడు, వెంకటరెడ్డి, ఎస్‌వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, రవీంద్ర, రామయ్యస్వామి, నారాయణరావు, శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



శంఖవరంలో మేకపాటి రాజారెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరం సర్పంచ్ బోగిరెడ్డి మల్లేశ్వరి, ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన యాభై కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆకర్షితులై తాము టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలంటే ఒక్క జగన్ ద్వారానే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లుగా సర్పంచ్ తెలిపారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగిస్తుందని, రెండోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. నియోజకవర్గంలో తాను గడప గడపకూ తిరుగుతున్న సందర్భంగా ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీపై ఎంతో ఆదరాభిమానం చూపిస్తున్నారన్నారు. ఏ గ్రామం వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చే వారు అధికంగా ఉన్నారన్నారు. ఇప్పటికే టీడీపీకి చెందిన అనేక మంది నేతలు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ మద్దూరు బాబు, వైఎస్సార్‌సీపీ నేతలు గణపం రమేష్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డి, సూరం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కలిగిరి: కలిగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే మేకపాటి పర్యటన

మర్రిపాడు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం మర్రిపాడు మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మర్రిపాడులో జరిగే వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం కంపసముద్రంలో విజయీభవ యాత్ర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు కోరారు.

హిందూధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

దుత్తలూరు: హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు బెల్లంకొండ పెదభద్రయ్య కోరారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంగమాంబ దేవస్థానంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అష్టోత్తర పూజ, కుంకుమార్చన, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మ వారికి మేళతాళాల నడుమ పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వై.లావణ్య అన్నమాచార్యుల కీర్తనల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సనాతన హిందూ ధర్మ పరిరక్షణార్థం హిందూ ధర్మం మరింత వ్యాప్తి కోసం ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిబద్ధత కలిగిన నేత తూపిరి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



తూపిరి పెంచలయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తదితరులు

బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, బోగోలు మాజీ సర్పంచ్ తూపిరి పెంచలయ్య పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో పెంచలయ్య సంతాప సభను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తూపిరి పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెంచలయ్య బోగోలు ప్రజలకే పార్టీలో రాష్ట్రస్థాయి పదవులకే వన్నె తెచ్చారని, ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీతో పాటు ప్రజాసమస్యలపై కూడా పెంచలయ్య నిబద్ధతతో వ్యవహరించే వారన్నారు. పెంచలయ్య మృతి పార్టీకి, పంచాయతీకి తీరని లోటు అని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ క్యాంపు



పెరుమాళ్లపాడులో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

చేజర్ల: చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆదివారం మండలంలోని పెరుమాళ్లపాడులో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చదువులు మానేసిన విద్యార్థులకు, 10వ తరగతి పాసై ఇంటర్మీడియట్ చేరని విద్యార్థుల డేటాను సేకరించి సమీప సచివాలయ కార్యదర్శికి, సర్పంచ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్ ప్రసాద్, చేజర్ల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చివరి తడి వరకు సాగునీరు

- మేకపాటి రాజగోపాల్ రెడ్డి



కావలి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద నేతలతో మేకపాటి రాజగోపాల్ రెడ్డి

సంగం: జలదంకి మండలంలోని రైతులు అందరికీ పూర్తి స్థాయిలో పంటకు అవసరమైన చివరి తడి వరకు సాగునీరు అందేలా చూస్తామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. జలదంకి మండల రైతులకు సాగునీరు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో సంగం కావలి కాలువ హెడ్ రెగ్యులర్ వద్ద నీటిని ఫ్లోను పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీరు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుతో ఫోన్‌లో మాట్లాడుతూ జలదంకి మండలానికి సాగునీరు విడుదల ఫ్లోను పెంచాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగించమని, రేపటి నుంచి సాగునీటి విడుదల సామర్థ్యాన్ని పెంచుతామని రాజగోపాల్‌రెడ్డికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో వ్యవసాయం సాగు చేస్తున్న అన్నదాతలకు ఒక్క ఎకరా కూడా ఎండకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. ఆయన వెంట ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు ఉన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధం తీసుకువస్తున్న ఆస్తాన ఏ నూరియా కమిటీ సభ్యులు

సంగం: మండలంలోని దువ్వూరులో కొలువైన హజరత్ ఖాజా గరీబ్ నివాజ్ మొయినుద్దీన్ చిష్టి రహమతుల్లా అల్లై ఆజ్మీరి గంధమహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆస్తానా ఏ నూరియాలో హజరత్ షేక్ భాషా సాహెబ్ నూరి ఆధ్వర్యంలో మేళతాలాలు నడుమ గంధాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. గంధం ఆస్తాన ఏ నూరియాకు చేరుకున్న అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంధమహోత్సవాన్ని తిలకించారు. గంధ మహోత్సవానికి వచ్చిన భక్తులకు గంధాన్ని పంచి పెట్టి ప్రసాదాలు అందజేశారు. గంధ మహోత్సవం సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్తాన ఏ నూరియా కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీడని గుట్టు.. పట్టించుకుంటేే ఒట్టు

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న పోలీస్‌శాఖ కొన్ని కేసుల దర్యాప్తులో అలవికాని అలక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కావలి పోలీసు యంత్రాంగం పనితీరు రోజురోజుకి తీసికట్టుగా తయారవుతోంది. కేసుల ఛేదన, నేరాల నియంత్రణలో పోలీసు యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంతో కీలకమైన కేసులన్నీ మూలన పడుతున్నాయి. చోరీలు, దాడులు. దౌర్జన్యాలతో పాటు హత్యలు వంటి దారుణ ఘటనల్లోనూ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి.

- కేసుల ఛేదనలో పోలీసుల వైఫల్యం
- నిర్లిప్తంగా వ్యవహరిస్తున్న దర్యాప్తు అధికారులు



కావలి: వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా ప్రసిద్ధి చెందిన కావలిలో శాంతిభద్రతల పరిరక్షణ గాడి తప్పుడుతుండడంతో అటు వ్యాపారులను, ఇటు ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల కాలంలో జరిగిన వరుస చోరీ ఘటనల్లో ఒక్క కేసు కూడా కొలిక్కి రాకపోగా సుమారు రెండేళ్ల క్రితం కావలిలో తీవ్ర సంచలనం సృష్టించిన ఓ గుర్తుతెలియని వివాహిత దారుణ హత్య ఘటనలో కూడా ఎటువంటి పురోగతి లేకపోవడం పోలీసుల పనితీరుకు అద్దం పడుతుంది.

రెండేళ్లు గడుస్తున్నా..

కావలి శివారు ప్రాంతం వెంగాయగారిపాళెం వద్ద ఓ లేఅవుట్‌లో 2022 మార్చి 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 30 ఏళ్ల గుర్తుతెలియని వివాహితను దారుణంగా హతమార్చి ఘటనా స్థలంలోనే తగుల బెట్టారు. 7వ తేదీ వేకువన మృతదేహం కాలిపోతున్న విషయాన్ని స్థానిక కల్లుగీత కార్మికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం అప్పటికే చాలా వరకు కాలిపోవడంతో మృతురాలి ఆనవాళ్లు లభించలేదు. మృతదేహం చేతికి ఉన్న బ్లూ, గ్రీన్ కలర్ నూలుదారాలు, మహిళ ధరించిన పంజాబీ డ్రస్ ఆనవాళ్లు, పింక్ కలర్ ఫ్యాన్సీ కమ్మలు, గోల్డ్‌కలర్ కాళ్ల పట్టీలు, వెండి మెట్టెలు, తాళిబొట్టు మాత్రమే లభించాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. కావలి శివారు ప్రాంతంలో హైవేకి వంద మీటర్ల దూరంలోనే మహిళను చంపి తగుల బెట్టడంపై పట్టణ వాసులు భయాందోళనలకు గురయ్యారు. ఘటన జరిగి రెండేళ్లు దాటుతున్నా ఇంత వరకు పోలీసులకు చిన్నపాటి క్లూ కూడా సేకరించలేకపోవడం గమనార్హం. కేసు దర్యాప్తులో కావలి పోలీసులకు, సీసీఎస్ అధికారులకు సమన్వయం కుదరకపోవడంతో కేసు మూలన పడేసినట్లుగా తెలుస్తుంది.

వరుస చోరీలతో వణుకు

కావలి పట్టణంలో గతేడాది నుంచి వరుస చోరీలు పట్టణ వాసులకు వణుకు పుట్టిస్తున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో కట్టుదిట్టమైన భద్రత ఉండే బృందావనం కాలనీలో భారీ చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే చాకచక్యంగా తలుపు గడియ తప్పించి లోపలికి ప్రవేశించిన దొంగలు భారీగా బంగారం, నగదు చోరీ చేశారు. సుమారు కోటి రూపాయలకు పైగా విలువైన సొత్తు చోరీకి గురైంది. చోరీ జరిగిన బృందావనం కాలనీ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. కాలనీతో పాటు రోడ్డు మొత్తం కూడా పోలీసు నిఘా కెమెరాలు ఉన్నాయి. అయినా కూడా ఇంత వరకూ దొంగను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. అప్పటి నుంచి కావలి పట్టణంలో వరుసగా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది ఏప్రిల్-మే నెలల మధ్య కాలంలోనే ఏకంగా 20కి పైగా చోరీలు జరిగాయి. ఆ తర్వాత కూడా అడపాదడపా తాళాలు వేసున్న ఇళ్లల్లో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కేసుల్లో ఒక్కరినీ కూడా పోలీసులు ఇంత వరకు అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బందోబస్తు డ్యూటీలు, సామాన్యులపై జులుం చూపించడం మినహా దర్యాప్తుకు పనికిరావడం లేదంటూ ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నా పోలీసుల్లో మాత్రం మార్పు రావడం లేదు.